జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

సోమవారం | 19-1-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 566 పేజీలు: 4 వెల: రూ.7



- 19 నుంచి 24 వరకూ పలు ప్రదర్శనలు
- 23న శోభాయాత్ర, లేజర్ షో
- 24న థమన్ లైవ్ కాన్సర్ట్, డ్రోన్ షో
- 24న అర్ధరాత్రి నుంచి ఆదిత్యుని నిజరూప దర్శనం
- ఆధ్యాత్మిక సాంస్కృతిక వేదికగా శ్రీకాకుళం నగరం

సిక్కోలులో నేటి నుంచి..

రథసప్తమి వేడుకలు

అరసవల్లి, జనవరి 18 (వార్త): సూర్య భగవానుడి జన్మదినోత్సవమైన రథసప్తమిని పురస్కరించుకుని శ్రీకాకుళం నగరం ఆధ్యాత్మిక సాంస్కృతిక వేదికగా మారనుంది. ఈ నెల 19 నుంచి 24 వరకు ఆరు రోజుల పాటు జిల్లా యంత్రాంగం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా వేడుకలను నిర్వహిస్తోంది. ఈ ఉత్సవాల్లో ప్రతి రోజూ ప్రజలను అలరించేలా క్రీడలు, సాహసయాత్రలు, అద్భుతమైన సాంస్కృతిక ప్రదర్శనలను ఖరారు చేశారు. ఈనెల 19, 20, 21 తేదీల్లో ప్రతిరోజూ ఉదయం 9 నుండి సాయంత్రం 5 గంటల వరకు డచ్ బిల్డింగ్ వేదికగా హెలీరైడ్స్ సాహసయాత్రలు నిర్వహించనున్నారు. ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్స్‌లో ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ క్రీడా పోటీలు జరగనున్నాయి. ప్రతిరోజూ సాయంత్రం 5గంటల నుండి రాత్రి 10 గంటల వరకు కె.ఆర్. స్టేడియంలో ఫుడ్ ఎగ్జిబిషన్, కిడ్స్ ప్లే ఏరియా, అమ్యూజ్‌మెంట్ పార్క్ ప్రజలకు అందుబాటులో ఉంటాయి. అలాగే ఈనెల 22న భక్తి, హాస్య జల్లులు కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం ఏడు గంటలకు 80 ఫీట్ల రోడ్డులో నిర్వహించే మెగా సూర్య నమస్కారాలు, సాయంత్రం ఐదు గంటల నుంచి కె.ఆర్. స్టేడియంలో భారతి రమేష్ ఆర్కెస్ట్రా, శ్రీ సాయి శివ నృత్య కళా నికేతన్ ప్రదర్శనలు ఉంటాయి. దుంపల ఈశ్వరరావు శాస్త్రీయ, జానపద సంగీతం, మావుడూరి బ్రదర్స్ మ్యూజికల్ షో అలరించనున్నాయి. రాత్రి ఏడు గంటల నుంచి పవన్ బ్యాండ్, మిమిక్రీ షోతో పాటు ప్రముఖ గాయకుడు గోరెటి వెంకన్న గళం విప్పనున్నారు. జబర్దస్త్ టీమ్ (ఇమ్మాన్యుయేల్, నూకరాజు, రియాజ్, ఆసియా) కామెడీ షో, ఆ తర్వాత బాణాసంచా ప్రదర్శన హైలైట్‌గా నిలవనున్నాయి. ఇక 23న శోభాయాత్ర - లేజర్ షో ఉంటుంది. మధ్యాహ్నం రెండు గంటల నుండి డే అండ్ నైట్ జంక్షన్ నుంచి అరసవల్లి వరకు కన్నుల పండువగా శోభాయాత్ర సాగనుంది. సాయంత్రం ఐదు గంటల నుంచి రాజు బ్రదర్స్ సాక్సోఫోన్, నీరజ సుబ్రహ్మణ్యం శాస్త్రీయ నృత్యం, ఆరోహి మ్యూజికల్ అకాడమీ షోలు ఉంటాయి. రాత్రి ఏడు గంటల నుంచి జబర్దస్త్ రామ్ ప్రసాద్ టీమ్ కామెడీ, యాంకర్ సౌమ్య రావు నిర్వహణలో ఖన్నా మాస్టర్ 'డి-డాన్సర్ల బృందం నృత్యాలు నిర్వహిస్తారు. పల్సర్ బైక్ రమణ బృందం జానపద గీతాల సందడితో పాటు అద్భుతమైన లేజర్ షో ఉంటుంది. 24న ముగింపు వేడుకల్లో ప్రఖ్యాత సంగీత దర్శకుడు థమన్ లైవ్ కాన్సర్ట్, సాయంత్రం సెలబ్రిటీలు అక్ష ఖాన్, మణికంఠ, తేజస్వినిల ప్రదర్శనలు, తన్మయి శాస్త్రీయ నృత్యం, గణపతి శర్మ యామిని కర్రిల మ్యూజికల్ షోలు, రాత్రి ఏడు గంటల నుంచి స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ థమన్ లైవ్ కాన్సర్ట్ జరగనుంది. ఈ కార్యక్రమానికి సినీ నటుడు ఆది ముఖ్య అతిథిగా హాజరుకానుండగా, యాంకర్లు సాయికుమార్, చంద్రికలు సందడి చేయనున్నారు. వేడుకల ముగింపులో భాగంగా ఆకాశంలో కళ్లు చెదిరే డ్రోన్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. అదేరోజు అర్ధరాత్రి నుంచి సూర్య భగవానుడు నిజరూప దర్శన భాగ్యాన్ని భక్తులకు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది.

వేడుకల నిర్వహణలో..
లోటుపాట్లు ఉండకూడదు

- దర్శన సమయంలో సామాన్య భక్తులకు పెద్దపీట
- నాలుగు వరుసల్లో క్యూలైన్లు
- దాతల పాస్‌లు ఉన్నవారికి నేరుగా ప్రవేశం
- నేటి నుంచి రూ.300, రూ.100 టిక్కెట్లు
- 24 నుంచి ఆన్‌లైన్‌లోనే క్షీరాభిషేకం టిక్కెట్లు
- దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్
- అధికారులతో కలిసి రథసప్తమి వేడుకల పర్యవేక్షణ



లోపల పేజీల్లో

నేటి నుంచి హెలీకాప్టర్ రైడింగ్

రథసప్తమి వేడుకలు సందర్భంగా సోమవారం నుండి హెలీకాప్టర్ రైడింగ్ జరుగనుందని జిల్లా కలెక్టర్ స్పష్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఆర్‌అండ్‌బి వద్ద ఆఫ్‌లైన్‌లోనే మూడు కౌంటర్లు ద్వారా టికెట్లు విక్రయాలు జరుగుతాయన్నారు. అందరికి టికెట్ ధర రూ.2200లు ఉంటుందని తెలిపారు. టికెట్లు ముందుగానే తీసుకొనే విధంగా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుండే హెలీ రైడింగ్ జరుగుతుందని, రోజుకు 200 నుండి 250 మంది వరకు రైడింగ్ చేసే అవకాశం ఉందని చెప్పారు. హెలీకాప్టర్ పై జిల్లాను వీక్షించే అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

23న డ్రోన్ షో

రథసప్తమి వేడుకలు సందర్భంగా శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఈ నెల 23వ తేదీన ప్రతిష్ఠాత్మకంగా డ్రోన్స్ షో నిర్వహించనున్నట్టు జిల్లా కలెక్టర్ స్పష్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. సాయంత్రం ఏడు గంటల నుండి ఈ షోను నిర్వహిస్తారన్నారు.

రథసప్తమికి
ఆన్‌లైన్ టికెట్లు విడుదల

నేటి నుంచి సిక్కోలులో
సైన్స్ సంబరం

సురభి నాటక వైభవం..
నేటి నుంచే

పొందర వీధి రహదారిని అభివృద్ధి చేయాలని వినతి

జలుమూరు, జనవరి 18(వార్త): శ్రీముఖలింగం పంచాయతీ పరిధిలోని పొందరి వీధిలో రహదారి అభివృద్ధి చేయాలని కోరుతూ శాసనసభ్యులు బగ్గు రమణమూర్తికి స్థానికులు వినతిపత్రం అందజేశారు. కాలనీలో రహదారి వెడల్పు తక్కువగా ఉండటంతో 108 అంబులెన్స్‌తో పాటు ఇతర అత్యవసర వాహనాలు రాలేకపోతున్నాయని సర్పంచ్ సతీష్‌తో పాటు స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సమస్యను పరిశీలించి, రహదారి అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని, అవసరమైన నిధులు మంజూరు చేయిస్తామన్నారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.



నేడు ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక

శ్రీకాకుళం టౌన్, జనవరి 18 (వార్త):ప్రజా ఫిర్యాదుల నమోదు పరిష్కార వేదిక జిల్లా పరిషత్‌లో సోమవారం నిర్వహించనున్నామని జిల్లా కలెక్టర్ స్పష్నిల్ దిన కర్ పుండ్కర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు వారి అర్జీలు నేరుగా గాని, ఆన్లైన్‌లో మీకోసం డాట్ ఏపీ డాట్ జిపో వి డాట్ ఇన్ వెబ్సైట్‌లో నమోదు చేసుకోవచ్చన్నారు. అర్జీదారుల అర్జీల నమోదు, నమోదైన అర్జీల గురించి వాటి యొక్క స్థితి దానికి సంబంధించి సమాచారం గూర్చి తెలుసుకోవాలంటే 1100కి నేరుగా కాల్ చేయవచ్చని వివరించారు.

27 నుంచి మహిళలకు శిక్షణ

శ్రీకాకుళం టౌన్, జనవరి 18 (వార్త):యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఎచ్చెర్లలో ఈనెల 27 నుంచి మహిళలకు మగ్గం వర్క్, బ్యూటీ పార్లర్, టైలరింగ్‌లో 31 రోజులు పాటు ఉచిత శిక్షణా తరగతులు నిర్వహించనుందని సంస్థ డైరెక్టర్ రామ్ జీ తెలిపారు. శిక్షణా కాలంలో ఉచిత వసతి మరియు భోజన సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 7993340407, 9553410809 నంబర్లను సంప్రదించాలన్నారు.

అనాథలకు అన్నదానం

మందస, జనవరి 18(వార్త): సిక్కోలు ఉద్దానం సేవాసమితి ఆధ్వర్యంలో అనాథలకు అన్నదానం కార్యక్రమం జరిగింది. నరసింహ, శ్రీను, కూర్మారావు, కుమార్, సంతోష్‌ల సహకారంతో రోడ్డుపై ఉండే అనాథలకు, అభాగ్యులకు అన్నదానం చేశారు. ఎవరైనా పెళ్లిరోజులు, పుట్టిన రోజులు, శుభకార్యక్రమాలు జరిగితే అనవసర ఖర్చులు పెట్టకుండా ఇలాంటివారికి ఒక్క పూట అన్నం పెట్టాలని సిక్కోలు ఉద్దానం సేవాసమితి ప్రతినిధులు కోరారు. శ్రీకాకుళం జిల్లాలో ఎవరికైనా అత్యవసర సమయంలో అంబులెన్సు సర్వీస్ కావాలంటే సిక్కోలు ఉద్దానం సేవాసమితి అంబులెన్సు సర్వీస్‌ని ఉపయోగించుకోవాలని వారు కోరారు. 7207119285 అనే ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

స్నేహితురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

మందస, జనవరి 18(వార్త): తమతో కలసి చదువుకున్న విద్యార్థిని మరణించడంతో ఆ కుటుంబానికి క్లాస్ మేట్స్ ఆర్థిక సాయం అందజేసి, ఉదారతను చాటుకున్నారు. మందస మండలంలోని ఉద్దాన ప్రాంతమైన లొహరిబంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2005వ సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న విద్యార్థిని సాహుకారి లత ఇటీవల మరణించింది. ఆమెతో చదువుకున్న పూర్వ విద్యార్థులు తమతో చదివిన లత అకాలమరణం చెందడంతో వారంతా ఆవేదన వ్యక్తం చేశారు. మృతురాలి తల్లి భానమ్మను కలిసి సంతాపం తెలిపారు. తమ వంతు సహాయంగా 10,000 రూపాయలు అందజేశారు.

దాతల సాయం.. బాగు పడిన బడి

మందస, జనవరి 18(వార్త): దాతలు స్పందించారు.. గ్రామంలోని బడిని బాగు చేశారు... పలువురికి ఆదర్శంగా నిలిచారు. మందస మండలంలోని బిన్నళమదనాపురం గ్రామంలో ప్రాథమిక పాఠశాల ఉంది. సమస్యలతో సతమతమవుతున్న ఈ పాఠశాలను బాగు చేయడానికి దాతలు ముందుకు వచ్చారు. 2024-2025వ సంవత్సరంలో తెప్పల ఉమాపతి ప్రధానోపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్న సమయంలో ఎస్జీటీ సారి ప్రేమకుమార్ రూ.14వేలుతో రంగులు వేయించారు. అనంతరం గ్రామస్థులు, యువకుల సహకారంతో విద్యార్థులు కూర్చోవడానికి సుమారు రూ.40వేలుతో బెంచీలు ఏర్పాటు చేశారు. యువకుల సహకారంతో సుమారు రూ.11000 వేలుతో గ్రీన్ బోర్డులు ఏర్పాటు చేయించారు. ప్రస్తుతం పాఠశాల ఆహ్లాదకరమైన వాతావరణంలో అందంగా దర్శనం ఇస్తోంది. పలువురికి ఆదర్శవంతంగా మారింది.

ఏడీఆర్ఎం రామారావుకు సన్మానం

మందస, జనవరి 18(వార్త):అడిషనల్ డివిజనల్ రైల్వే మేనేజర్ (విశాఖపట్నం)గా ఎంపికైన మందస మండలం గెడ్డపూరు గ్రామానికి చెందిన కుందు రామారావుకు గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. ముందుగా ఆయనకు ఘన స్వాగతం పలికారు. గ్రామస్థులు, యువకులు గ్రామానికి తొలిసారిగా చేరుకున్నటువంటి ఆయనకు గ్రామస్థులు, పెద్దలు, మహిళలు పూలతో, బాణ సంచా పేలుస్తూ ఆయనకు మంగళ వాయిద్యాల మధ్య గ్రామానికి స్వాగతం పలికారు. గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన తల్లి, భార్యతో కలిపి ఘనంగా గజమాలతో శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మారుమూల గ్రామానికి చెందిన రామారావు రైల్వేలో ఉద్యోగం వచ్చి చేస్తున్నప్పటికీ, యుపీఎస్సీ రాయడం ఎంతో స్ఫూర్తి దాయకమన్నారు. తితిలీ సమయమే కాకుండా ఇతర ఏ సమస్యలు వచ్చినా నేనున్నానని ఆర్థిక సాయమందించే ఆయన గొప్ప మనసన్నారు. భారతీయ రైల్వే అభివృద్ధిలో భాగంగా జపాన్ వెళ్ళి రైళ్ళు రీసెర్చ్ చేయడం అందులో సభ్యులు కావడం గొప్ప విషయమన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని గొప్ప ఉద్యోగం పొందడంపై గ్రామస్థులు గర్వంగా చెప్పుకుంటున్నారని అన్నారు. యువత తపనతో చదివి స్థిరపడాలని అన్నారు. కార్యక్రమంలో మహిళలు, పెద్దలు, యువత, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దావోస్ సదస్సుకు కేంద్ర మంత్రి రామ్మోహన్

*** స్విట్జర్లాండ్‌లోని మోరీచ్‌లో 19 నుంచి 23 వరకు వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సదస్సు * ఇదివరకే వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ నుండి యంగ్ గ్లోబల్ లీడర్‌గా అవార్డు పొందిన రామ్మోహన్ * కీలక సదస్సులో కీలకంగా వ్యవహరించే బాధ్యతను కేంద్ర మంత్రికి అప్పజెప్పిన ప్రధాని మోదీ * బాబు, లోకేష్‌లతో కలసి తెలుగువారితో మరో ముఖ్య సమావేశంలో శ్రీకాకుళం ఎంపీ**

శ్రీకాకుళం, జనవరి 18 (వార్త): స్విట్జర్లాండ్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సదస్సుకు మరోసారి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు హాజరయ్యారు. మన దేశం తరపున కేవలం ముగ్గురు కేంద్ర మంత్రులు మాత్రమే ఈ ప్రతిష్టాత్మక సదస్సులో పాల్గొనే అవకాశం ఉండగా.. ఇదివరకే ఈ సదస్సుకు హాజరైన రామ్మోహన్ నాయుడుకు మరోసారి అవకాశం కల్పించారు ప్రధాని మోదీ. ఈ నేపథ్యంలో ఆదివారం స్విట్జర్లాండ్‌లోని మోరీచ్‌లో జరుగుతున్న సదస్సుకు ఆయన హాజరయ్యారు. ఈనెల 19 నుండి 23 వరకు ఈ సదస్సు జరగనుండగా.. మొత్తంగా 130 దేశాల నుండి 3000 మందికి పైగా ప్రతినిధులు హాజరు కానున్నారు. ఈ సదస్సుకు భారతదేశం తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు.. భారత ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా, దేశీయ విమానయాన వ్యవస్థను మరింత వృద్ధిలోకి తీసుకువచ్చే విధంగా కీలక వ్యక్తులను కలవడం, సదస్సులో భారత దేశ వృద్ధిని, భవిష్యత్ ఆలోచనలను తెలియపరచడంలో ప్రస్తుతం రామ్మోహన్ నాయుడు కీలకంగా వ్యవహరించనున్నారు.

పట్టాభిషేకం జరిగిన చోటే..

ప్రస్తుత వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ ఆధ్వర్యంలో ఈ కీలక సదస్సు దావోస్‌లో జరుగుతోంది. కాగా.. ఇదివరకే వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ నుండి యంగ్ గ్లోబల్ లీడర్‌గా రామ్మోహన్ నాయుడు అవార్డు సైతం తీసుకుని ఉన్నారు. రామ్మోహన్ నాయుడు ప్రతిభను ఇదివరకే ఈ ప్రతిష్టాత్మక సంస్థ గుర్తించడం.. అలాంటి వేదికపై భారతదేశం తరపున పాల్గొనే అవకాశం మరోసారి రామ్మోహన్ నాయుడుకు రావడం పట్ల కూటమి శ్రేణులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. యంగ్ గ్లోబల్ లీడర్ గా పట్టాభిషేకం జరిగిన చోటనే.. మరోసారి తన ప్రావీణ్యం చూపే అవకాశం రామ్మోహన్ నాయుడుకు వచ్చిందని.. ప్రధాని మోదీ అప్పజెప్పిన బాధ్యతను రామ్మోహన్ నాయుడు ఫలవంతంగా పూర్తి చేస్తారని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

బాబు, లోకేష్‌తో పాటు కీలక సమావేశం

ఈ దావోస్ పర్యటన నేపథ్యంలోనే మరో కీలక సమావేశంలో సైతం రామ్మోహన్ నాయుడు పాల్గొనున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్‌తో కలసి దావోస్‌లోని తెలుగు కమ్యూనిటీతో ప్రత్యేకంగా భేటీ కానున్నారు. విమానయాన రంగంలో, రాష్ట్రంలో పెట్టుబడుల విషయంలో కీలక సంస్కరణలు సాధించే దిశగా రామ్మోహన్ నాయుడు కీలక ప్రసంగం చేయడంతో పాటు ముఖ్యమైన వ్యక్తులతో భేటీ కానున్నారు.

అపూర్వ స్వాగతం..

ఆదివారం స్విట్జర్లాండ్‌లోని జూరిచ్ ప్రాంతానికి సహచర కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ తో కలసి రామ్మోహన్ నాయుడు చేరుకున్నారు. వారికి స్విట్జర్లాండ్ లోని భారత రాయబారి మృదుల్ కుమార్ ఘన స్వాగతం పలికారు. ప్రపంచ ఆర్థిక రాజధాని అయిన దావోస్‌లో ఈ సదస్సు జనవరి 19 నుంచి జనవరి 23 వరకు ఐదు రోజుల పాటు సాగనుంది. ఈ ఏడాది 'ఏ స్పిరిట్ ఆఫ్ డైలాగ్' థీమ్‌తో వరల్డ్ ఎకనామిక్ ఫోరం జరగనుంది. వరల్డ్ ఎకనామిక్ ఫోరంలో పోటీ ప్రపంచంలో సహకారం, ఆవిష్కరణల ఆధారిత వృద్ధి, సమ్మిళిత అభివృద్ధి పై చర్చలు జరగనున్నాయి.

పూర్వ విద్యార్థుల.. ఆత్మీయ కలయిక

మందస, జనవరి 18(వార్త): మందస మండలంలోని హరిపురం గ్రామంలో గల జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1992-1993 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు 33సంవత్సరాల తరువాత కలుసుకొని, అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్వామి వివేకానంద విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆవిష్కరించారు. చదువుకున్న స్కూల్‌కు వితరణగా ఒక బీరువా అందజేశారు. 1993వ సంవత్సరంలో తమతో చదువుకొని చనిపోయిన ముగ్గురు స్నేహితుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున రూ.30వేలు అందించారు. అప్పట్లో విద్యాబుద్ధులు నేర్పిన రిటైర్డ్ ఉపాధ్యాయులు చంద్రరావు, సత్యవతి, జన్ని సోమేశ్వరరావు తదితరులను సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, విద్యార్థినిలు కలుసుకొని సంతోషంగా గడిపారు.

21 ఏళ్ల అనంతరం
ఆత్మీయ సమ్మేళనం

పలాస, జనవరి 18 (వార్త): పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2004-2005 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు 21ఏళ్ల అనంతరం ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 120 మంది పూర్వ విద్యార్థులు కుటుంబ సభ్యులతో కలిసి ఈ సమ్మేళనంలో పాల్గొని తమ పాఠశాల రోజుల మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆనాటి గురువులు కార్యక్రమానికి హాజరై తమ శిష్యులను చూసి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. పూర్వ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విజయనందరాజు, అప్పారావు, పిటి తవిటయ్య, విజయ్ కుమార్, సత్యనారాయణ, మోహనరావు, ప్రసాదరావు, నిర్మల, రాజ్యలక్ష్మి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేతలకు
బహుమతులు ప్రదానం

జలుమూరు, జనవరి 18(వార్త): జలుమూరు మండల కేంద్రంలో కోన సుధా మెమోరియల్ ఆధ్వర్యంలో నిర్వహించిన జలుమూరు ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ శనివారం ముగిసింది. విజేతలకు శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి, నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన ట్రోఫీ, నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి టోర్నమెంట్లు ఎంతగానో దోహదపడతాయన్నారు. క్రీడలు యువతను క్రమశిక్షణ, ఐక్యత, శారీరక దృఢత్వం వైపు నడిపిస్తాయని పేర్కొన్నారు. ఈ టోర్నమెంట్‌లో విజేత జట్టుకు రూ.15,000, రన్నరప్ జట్టుకు రూ.10,000 నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వెలమల రాజేంద్ర నాయుడు, పిఏసిఎస్ చైర్మన్ దుంగ స్వామిబాబు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మునికోటి దాంబాబు, మురళీ డాక్టర్, దత్తు బాబు, గుండ రామకృష్ణ, గొలివి బాలకృష్ణ, మునికోటి గంగాధర్ తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు, క్రీడాకారులు, నిర్వాహకులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పలాస, జనవరి 18 (వార్త): బ్రాహ్మణతర్ర విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో లైన్స్ మరమ్మత్తులు కారణంగా సోమవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని పలాస ఏఈ జి.యజ్ఞేశ్వరరావు తెలిపారు. మహాదేవపురం పోటీయా, గొట్టుమీదాఉరు, కొఠారింగి, తాళ్లభద్ర గ్రామాలతో పాటు పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

ఘనంగా జనసేన జండా ఆవిష్కరణ

*** పార్టీ బలోపేతమే లక్ష్యం * గ్రామాల అభివృద్ధికి కృషిచేస్తా * సుడా చైర్మన్ కొరికాన రవికుమార్, పార్టీ నాయకురాలు భవాని**

ఎల్ఎన్‌పేట, జనవరి18(వార్త): మండలంలోని మిరియాపల్లి పంచాయతీ, వాడవలస గ్రామంలో పాతపట్నం జనసేన నాయకురాలు కొరికాన భవాని, సుడా చైర్మన్ రవి కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం జనసేన జెండా ఆవిష్కరణ ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రామంలో ఉన్న రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా జనసేన అధ్యక్షులు పిసిని చంద్రమోహన్ హాజరై మాట్లాడారు. పాతపట్నం నియోజకవర్గ జనసేన నాయకురాలు కొరికాన భవాని నాయకత్వాన్ని ఈ నియోజకవర్గంలో ఉన్నటువంటి అన్ని గ్రామాలలో వ్యాప్తిచేయాల్సిన అవశ్యకత మనందరిపై ఉందన్నారు. ప్రజల అభ్యుదయం కోసం జనసేన పార్టీ ప్రజల పట్ల ఎప్పుడూ పనిచేస్తుందన్నారు. పాతపట్నం నియోజకవర్గంలో కానీ ఈ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో కానీ తాగునీరు, సాగునీరు, అన్ని వర్గాల ప్రజానీకానికి గాని కొరికాన ఫౌండేషన్ ద్వారా తమ సొంత నిధులతో ఎన్నో కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలు ఈ జిల్లాలో కాని పాతపట్నం నియోజకవర్గంలో చేపట్టాలంటే వారి నాయకత్వాన్ని మరింతగా ప్రజల్లో తీసుకువెళ్లాల్సిన అవసరం ఉందని తెలిపారు. సర్పంచ్ లుకలాపు సుధీర్ మాట్లాడుతూ ఏ ప్రభుత్వాలు వచ్చినా ప్రజలకు కావాల్సినవి తాగునీరు, విద్య, వైద్యం ప్రధానమైనవన్నారు. మిరియాపల్లి, వాడవలస గ్రామాలకు వాటర్ ట్యాంక్ మంజూరు చేయాలని, రోడ్లు నిర్మించాలని కోరారు. సుడా చైర్మన్ రవికుమార్ మాట్లాడుతూ రైతులకు భరోసా, యువతకు భవిష్యత్, ఎటువంటి అవినీతిలేని నాయకత్వం, కులమతాలకు అతీతంగా జనసేన పార్టీ పనిచేస్తుందన్నారు. గ్రామంలో ప్రతీ ఒక్కరూ జన సైనికులుగా మారాలని ప్రజలకు వివరించారు. వాడవలస జనసైనికులు మాట్లాడుతూ గ్రామస్థుల వంశధార నదిలో స్నానం చేసేందుకు వెళితే చీకటిగా ఉంటోందని అక్కడ విద్యుత్ లైట్లు ఏర్పాటుచేయాలని, గ్రామంలో పాఠశాల, స్మశాన వాటిక ఏర్పాటు, వాడవలసకు ధనుకువాడకు మధ్య పైపు కల్వర్టు ఏర్పాటు చేయాలని వారు కోరారు. వెంటనే సుడా చైర్మన్ రవికుమార్ కలుగజేసుకొని జనసైనికుల కోరిక మేరకు సమస్యల్ని పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హిరమండలం మార్కెట్ కమిటీ చైర్మన్ మామిడి రామకృష్ణ, మండల అధ్యక్షులు కొల్లా రవీంద్ర, ఏఎంసి డైరెక్టర్ పిరియా నాగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్ల జయరాం, మండల ఉపాధ్యక్షులు రాంబాబు, రాజేష్, చిన్నారావు, ఎన్. అప్పలనాయుడు, బాలరాజు, యాకల మోహన్, జలుమూరు మోహన్, అవల గిరి, చెట్టు హరి, నక్క హరికృష్ణ, ఈశ్వరరావు, బైరి జగదీష్, వంశీ, శ్రీను, బైరి సత్యన్నారాయణ, తంగి వెంకటేష్, పొదిలాపు సత్యన్నారాయణ, రెడ్డి సాయి, తంగి శ్రీను, మహిళలు పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

ఎన్టీఆర్.. మహనీయుడు

పాతపట్నం, జనవరి 18 (వార్త): తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నంద మూరి తారక రామారావు 30వ వర్ధంతిని పాతపట్నంలోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మహా రక్తదాన శిబిరం, మెగా వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ప్రారంభించారు. 238 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. రక్తదాతలకు ప్రశంసాపత్రాలను అందజేశారు. నిరుపేద కుటుంబాలకు పండ్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్టీఆర్ మహానేత అన్నారు. ఒకవైపు సినిమా రంగంలోనూ, మరోవైపు రాజకీయ రంగంలోనూ ప్రభంజనం సృష్టించారన్నారు. తెలుగు జాతికి జరుగుతున్న అన్యాయాన్ని సహించలేక.. తెలుగుదేశం పార్టీని ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, నందమూరి అభిమానులు పాల్గొన్నారు.

తెలుగుజాతి ఆత్మ గౌరవానికి చిరునామా.. ఎన్టీఆర్

తెలుగుజాతి గర్వించదగ్గ మహనీయుడు

✻ శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్

✻ ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ✻ జిల్లాలో వాడవాడలా ఎన్టీఆర్ 30వ వర్ధంతి
✻ పేదలకు అన్న, వస్త్ర దానం ✻ రక్తదాన, వైద్య శిబిరాలు ఏర్పాటు

ఆమదాలవలస, జనవరి 18 (వార్త): తెలుగు జాతి ఆత్మగౌరవానికి చిరునామా ఎన్టీఆర్ అని పీయూసీ చైర్మన్, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. ఎన్టీఆర్ 30వ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆమదాలవలస పట్టణంలోని బ్రిడ్జ్ జంక్షన్‌లో గల నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆ మహానటుని, మహానేతను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, తెలుగు జాతి ఉనికిని ప్రపంచానికి పరిచయం చేసిన అపూర్వ వ్యక్తిత్వం నందమూరి తారక రామారావుకు దక్కుతుందన్నారు. నటుడిగా ఆయన వెండితెరపై ఆవిష్కరించిన పాత్రలు కేవలం వినోదానికి మాత్రమే పరిమితం కాకుండా, తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు, చరిత్రను దేశ విదేశాలకు చాటిచెప్పాయని తెలిపారు. శ్రీకృష్ణుడు, రాముడు, కర్ణుడు వంటి పాత్రల ద్వారా తెలుగు వారి మనోభావాలను ప్రతిబింబించిన నట సార్వభౌముడిగా ఎన్టీఆర్ చిరస్థాయిగా నిలిచారని అన్నారు. అలాగే రాజకీయ రంగంలోకి ప్రవేశించిన తరువాత కూడా ఆయన ప్రజల మనసుల్లో దేవుడిలా నిలిచారన్నారు. ప్రజలే దేవుళ్లు.. సమాజమే ఆలయం అనే భావనతో పాలన సాగించిన మహానేత ఎన్టీఆర్ అని కొనియాడారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రవేశపెట్టిన అనేక విప్లవాత్మక పథకాలు రాష్ట్ర రాజకీయ చరిత్రను మలుపుతిప్పాయని వివరించారు. రెండు రూపాయలకే బియ్యం పథకం ద్వారా పేదల ఆకలి తీర్చిన మహానుభావుడిగా ఆయనను చరిత్ర స్మరిస్తుందని చెప్పారు. తెలుగు భాషకు, తెలుగు సంస్కృతికి అధికారిక గుర్తింపు తీసుకురావడంలో ఎన్టీఆర్ పాత్ర మరువలేనిదన్నారు.

తెలుగువారి ఆత్మగౌరవాన్ని ఢిల్లీ స్థాయిలో గట్టిగా వినిపించిన తొలి నాయకుడిగా ఆయన ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని తెలిపారు. రాజకీయాల్లో విలువలు, నిబద్ధత, ప్రజల పట్ల బాధ్యత అనే అంశాలను కొత్తగా నిర్వచించిన నాయకుడు ఎన్టీఆర్ అని అన్నారు. ఇప్పటి తరానికి ఎన్టీఆర్ జీవితం ఒక స్ఫూర్తిదాయకమైన పాఠమని, ఆయన చూపిన మార్గం నేటి నాయకులకు దిక్సూచిగా నిలుస్తుందని తెలిపారు. వ్యక్తిగత లాభాలకన్నా ప్రజా ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇచ్చిన ఆయన త్యాగస్వభావం ఎప్పటికీ ఆదర్శనీయమన్నారు. ఎన్టీఆర్ పేరు తెలుగు జాతి చరిత్రలో సూర్యచంద్రులున్నంతకాలం చిరస్థాయిగా నిలిచిపోతుందని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం టౌన్, జనవరి 18(వార్త): బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎనలేని సేవలు అందించిన ప్రజానాయకుడు ఎన్టీఆర్ అని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శ్రీకాకుళం పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు మొదలవలస రమేష్‌తో కలిసి ఎన్టీ రామారావు వర్ధంతిలో పాల్గొన్నారు. ఏడు రోడ్ల జంక్షన్, సూర్యమహాల్ జంక్షన్, 80 అడుగుల రోడ్డులోని టీడీపీ కార్యాలయం ఆవరణలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల వ్యవస్థ ఏర్పాటు, మహిళలకు ఆస్తిలో సమాన హక్కు వంటి చారిత్రక సంస్కరణలు తీసుకొచ్చిన దూరదృష్టి గల నేత ఎన్టీఆర్ అని కొనియాడారు. ఎన్టీఆర్ ఆశయాలను కొనసాగిస్తూ ప్రజలకు సుపరిపాలన అందించేందుకు అందరం సమష్టిగా కృషి చేయాల్సిపుందన్నారు. ఎన్టీఆర్ చేసిన సేవలను స్మరించుకుంటూ, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం నియోజకవర్గ టీడీపీ ముఖ్యనాయకులు, సీనియర్ నేతలు, పార్టీ జిల్లా మండల, నగర పార్టీ వివిధ హోదాలలో ఉన్న నాయకులు, డివిజన్ ఇంచార్జిలు, సర్పంచులు, ఎంపీటీసీలు, కూటమి నాయకులు, నందమూరి అభిమానులు, పార్టీ మహిళలు, యువత, అనుబంధ విభాగాల నాయకులు, పార్టీ క్యాడర్ పాల్గొన్నారు.



తెలుగు జాతి ఆత్మగౌరవం ఎన్టీఆర్

మందస, జనవరి 18(వార్త): తెలుగు జాతి ఆత్మగౌరవం ఎన్టీ రామారావు అని పలువురు నాయకులు అన్నారు. మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 30వ వర్ధంతి మందస మండలంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, ప్రజాహిత పాలనకు ప్రతీక, స్వర్గీయ నందమూరి తారక రామారావు తెలుగు జాతి గర్వాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడన్నారు. సామాన్యుడి గుండె చప్పుడే తన పాలనకు పునాది అని నిరూపించిన మహా నాయకుడని, తెలుగు వారి ఆత్మగౌరవం అనే నినాదాన్ని రాజకీయ చరిత్రలో చిరస్థాయిగా నిలిపిన ధీరుడని కొనియాడారు. ప్రజల పక్షాన నిలబడి, పేదల సంక్షేమం కోసం ఎన్నో విప్లవాత్మక పథకాలు అమలు చేసి, రాష్ట్ర రాజకీయాలకు నూతన దిశానిర్దేశం చేసిన దూరదర్శి నాయకుడని, ఆ మహనీయుడి ఆశయాలు, సిద్ధాంతాలు మనకు స్ఫూర్తిగా నిలిచి, తరతరాలకూ మార్గదర్శకంగా నిలవాలని కోరారు. మందస మండలంలోని హరిపురం, మందస గ్రామాలలో ఆయన విగ్రహాలకు పూలమాలలతో అలంకరించి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మందస మండల అధ్యక్ష, కార్యదర్శులు, మండల నాయకులు, కార్యకర్తలు యువత, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఎన్టీఆర్.. యుగ పురుషుడు

✻ ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్ఈఆర్, విజయనగరం ఎంపీ కలిశెట్టి
✻ జి.సిగడాంలో ఎన్టీఆర్ కాంస్య విగ్రహం ఆవిష్కరణ



జి.సిగడాం, జనవరి 18(వార్త): యుగపురుషుడు నందమూరి తారక రామారావు అని, ఆయన సేవలు అపారమని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు(ఎన్ఈఆర్), విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ప్రయాణికుల విశ్రాంతి భవనం వద్ద పిన్నింటి భాస్కరరావు సొంతనిధులతో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ కాంస్య విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచంలో తెలుగుజాతికి గుర్తింపు తెచ్చిన మహనీయుడు ఎన్టీఆర్ అని అన్నారు. పేద ప్రజల అభివృద్ధికి విశేష కృషి చేసిన మహానాయకుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. సినిమా రంగంలో ఎన్నో పాత్రలకు జీవం పోసి విశ్వవిఖ్యాత నటసార్వభౌముడుగా అభిమానుల గుండెల్లో చెరగని ముద్ర వేశారన్నారు. రాజకీయాలకు సరికొత్త నిర్వచనం చెప్పిన నేత ఎన్టీఆర్ అని, ఎన్టీఆర్‌తోనే తెలుగువారి సత్తా ప్రపంచానికి తెలిసిందన్నారు. సంక్షేమానికి నాంది పలికిన నాయకుడు ఎన్టీఆర్ అని.. ఎన్టీఆర్ అంటే సినీ, రాజకీయ రంగంలో ప్రభంజనం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముద్దాడ ఈశ్వరమ్మ, ఎంపీడీఓ జి.రామకృష్ణారావు, పంచాయితీ కార్యదర్శి తులసీ ప్రసాద్ సాహు, నాలుగు మండలాల టిడిపి అధ్యక్షులు కుమరాపు రవికుమార్, ముప్పిడి సురేష్, బి.మల్లేశ్వరరావు, లెంక శ్యామలరావు, మండల బీజేపీ అధ్యక్షులు పైల విష్ణుమూర్తి, ఏఎంసీ ఉపాధ్యక్షుడు బూరాడ వెంకట రమణ, జి.సిగడాం పీఏసీస్ అధ్యక్షులు బెవర జగన్నాధరావు, మండల ప్రధాన కార్యదర్శి కుదిరెళ్ల బుజ్జి, జి.సిగడాం పీఏసీఎస్ డైరెక్టర్ పడాల అప్పన్న మాష్టారు, సర్పంచ్‌లు బోగాది అప్పలనాయుడు, వెంకటరావు మాస్టారు, మహిదాస్యం చిన్నారావు, జిల్లా జనసేన నాయకులు భూపతి అర్జున్ కుమార్, నాయకులు ముద్దాడ గౌరీ, మజ్జి కన్నం నాయుడు, మీసాల మోహన్, సి.గోవిందరావు, మజ్జి హరిబాబు, గంగ రాజు, పిన్నింటి మధు తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ సేవలు స్ఫూర్తిదాయకం

నరసన్నపేట/జలుమూరు, జనవరి 18(వార్త): తెలుగు ప్రజల హృదయాలలో సుస్థిర స్థానం సంపాదించుకుని, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఎనలేని సేవలు అందించిన మహనీయులు స్వర్గీయ నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) అని శాసనసభ్యులు బగ్గ రమణమూర్తి అన్నారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 30వ వర్ధంతి సందర్భంగా నరసన్నపేట పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యేతో పాటు నియోజకవర్గ సమన్వయకర్త బగ్గ అర్చన పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బగ్గ రమణమూర్తి మాట్లాడుతూ, జాతీయస్థాయిలో తెలుగువారి పౌరుషాన్ని చాటి చెప్పిన దార్శనిక నాయకుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. ఆయన పరిపాలనలో అమలైన ప్రజాహిత సంస్కరణలు, పరిపాలనా దక్షత, సేవలను స్మరించుకున్నారు. మండల వ్యవస్థ ఏర్పాటు, ఆస్తిలో మహిళలకు సమాన హక్కు వంటి విప్లవాత్మక నిర్ణయాలతో సమాజంలో సమానత్వానికి బాటలు వేసిన మహనీయులు ఎన్టీఆర్ అని పేర్కొన్నారు. అలాగే ఎన్టీఆర్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత తెలుగువారిపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎన్టీఆర్‌కు ఘన నివాళులు అర్పించారు. అలాగే నరసన్నపేట పట్టణం ఆదివారపుపేటలోని చిల్డ్రన్స్ పార్క్ వద్ద ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహానికి నియోజకవర్గ సమన్వయకర్త బగ్గ అర్చనతో కలిసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బగ్గ రమణమూర్తి మాట్లాడుతూ, ఎన్టీఆర్ ఒకే జీవితంలో మహానటుడిగా, ప్రజానాయకుడిగా రెండు చరిత్రలు సృష్టించిన శకపురుషుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు గొండు రామన్న, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణన్నాయుడు, రాష్ట్ర కళింగ వైశ్య నగరాల కార్పొరేషన్ డైరెక్టర్లు జామి వెంకట్రావు, నల్లన వెంకునాయుడు, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు పొద్దిన రత్నాలునాయుడు, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాధు కృష్ణారావు, పీఏసీఎస్ చైర్మన్లు దుంగ స్వామిబాబు, వెలమల చంద్రభూషణ్, భైరి భాస్కరరావు, జడ్పిటిసి ప్రతినిధి మెండ రాంబాబు తదితర నాయకులు పాల్గొన్నారు. అలాగే నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు, పట్టణ పార్టీ అధ్యక్షులు, తెలుగు యువత నాయకులు, మార్కెట్ కమిటీ చైర్మన్, నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

తెలుగువారి ఆత్మగౌరవానికి చిరునామా ఎన్టీఆర్

పలాస, జనవరి 18 (వార్త): తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన నందమూరి తారక రామారావు 30వ వర్ధంతి సందర్భంగా వజ్రపుకొత్తూరు మండల కేంద్రంలో ఆదివారం ఆ మహనీయునికి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, వజ్రపుకొత్తూరు మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి కర్ని రమణ పాల్గొన్నారు.

పలాసలో ఎన్టీఆర్ 30వ వర్ధంతి

పేదల పెన్నిధి, యుగపురుషుడు, తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక అయిన నందమూరి తారక రామారావు 30వ వర్ధంతిని పలాస మండలం, మున్సిపాలిటీలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏపిటిపిసి చైర్మన్ వజ్జ బాబురావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి తెలుగు తమ్ముళ్లు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఎన్టీఆర్ 30వ వర్ధంతి సందర్భంగా పలాస ఎమ్మెల్యే కార్యాలయంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి, ఆయన ఆశయాలను కొనసాగిద్దాం అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ ముఖ్య నాయకులు పీరుకట్ల విఠల్ రావు, వజ్జ బాబురావు, లోడగల కామేశ్వరరావు, బడ్డ నాగరాజు, గాలి క్రిష్ణ, గురిటి సూర్యనారాయణ, రవిశంకర్ గుప్తా, చిన్ని. డి.శంకర్, కార్యకర్తలు, ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

అన్న ఎన్టీఆర్ రాకతోనే రాష్ట్రానికి మంచి రోజులు

సోంపేట, జనవరి 18 (వార్త): అన్న నందమూరి తారక రామారావు రాజకీయాల్లోకి వచ్చి తెలుగుదేశం పార్టీని స్థాపించిన నాటి నుంచి ఈ రాష్ట్రానికి మంచి రోజులు ప్రారంభమయ్యాయని కంచిలి ఏఎంసి చైర్పర్సన్ మద్దిల విజయలక్ష్మి, మాకన్నపురం సర్పంచ్ మద్దిల నాగేశ్వరరావు అన్నారు. మాకన్నపురం గ్రామంలో టిడిపి కార్యాలయం వద్ద ఆదివారం ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనం గా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉలాల హరికృష్ణ, బత కల దీర్ఘారావు, కీళ్ళ ఈశ్వరరావు, మద్దు కోదండరావు మద్దిల చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళి

మెలియాపుట్టి, జనవరి 18 (వార్త): మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మహానేత నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) వర్ధంతిని ఆ పార్టీకి చెందిన నాయకులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం మెలియాపుట్టి మండల కేంద్రంలో ఆ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎన్టీఆర్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

లయన్ మిశ్రో మాస్టారుకు సన్మానం

ఎల్ఎన్‌పేట, జనవరి 17(వార్త): లక్ష్మీనర్సుపేట గ్రామంలో ఉన్నత పాఠశాల ఆవరణలో 1999-2000, 2000-2001లో పదవ తరగతి చది విన పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఉత్తమ ఉపా ధ్యాయ అవార్డు గ్రహీత, సంఘ సేవకులు లయన్ ఎం.కె.మిశ్రోను ఘనం గా పూర్వ విద్యార్థులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఉన్నత పాఠశాల కమిటీ ఛైర్మన్, గ్రామ పెద్దలు, పూర్వ విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. మిశ్రో మాస్టారు అందిస్తున్న సేవలను వక్తలు కొనియాడారు.

అరసవల్లికి పోటెత్తిన భక్తులు

అరసవల్లి, జనవరి18 (వార్త): సూర్యనారాయణ స్వామి దేవ స్థానానికి ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు పోటెత్తారు. టికెట్లు రూపేనా రూ.1,74,700, పూజలు, విరాళాల రూపంలో రూ.87,003, ప్రసాదాల రూపంలో రూ.1,06,515, దర్శనం, సూర్యనమస్కారములు, వివిధ సేవలు, ప్రసాదాల బుకింగ్‌ను మరింత సులభతరం చేస్తూ ఆన్‌లైన్ రిజర్వే షన్ ద్వారా మొత్తం రూపంలో రూ. 42,600 ఆదాయం వచ్చిందని ఈవో ప్రసాద్ తెలిపారు.

పేదలకు 'కొర్ల కన్నారావు' దాతృత్వం

మందస, జనవరి 18(వార్త): గాయత్రి ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ కొర్ల కన్నారావు మరోసారి ఉదారతను చాటుకున్నారు. సంక్రాంతి సందర్భంగా పందలాది నిరుపేదలు, దివ్యాంగులు, వృద్ధులకు వస్త్రాలు పంపిణీ చేశారు. ప్రతీ ఏటా గాయత్రి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కన్నారావు ఈ కార్యక్రమం నిర్వహిస్తుంటారు. మందస మండలంలోని భిన్నభమదనాపురం పంచాయతీలో వెంకటవరదరాజపురంలో సంక్రాంతి సందర్భంగా పలు కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా కన్నారావు, మాజీ ఎంపీపీ కొర్ల కవిత దంపతులు మాట్లాడుతూ పేదలకు అన్నదానం, వస్త్రదానం చేయడం ఆనందంగా ఉంటుందన్నారు. సంపాదించిన ఆదాయంలో ప్రతీ ఒక్కరూ కొద్ది పాటి సహాయం చేయాలని కోరారు. నిరుపేదలకు ఆర్థికంగా ఆదుకోవడం తమకు దేవుడిచ్చిన పరమన్నారు. దానాలతో ఆత్మ సంతృప్తి చెందుతుందన్నారు. కార్యక్రమంలో హరిపురం కోస్టల్ లైన్స్ క్లబ్ అధ్యక్షుడు మార్పు వెంకటేశం, మాజీ వైస్ ఎంపీపీ కారి ఈశ్వరరావు, కొంచాడ సురేష్ కుమార్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మధుపాంలో అన్నదానం

జి.సిగడాం,జనవరి18(వార్త): మధుపాం గ్రామంలో దుర్గాదేవి 18వ జాతర మహోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం గ్రామ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

శక్తి యాప్‌పై అవగాహన

జలుమూరు, జనవరి 18(వార్త): శ్రీముఖలింగం మధుకేశ్వరాలయంలో మహిళలు, బాలికల భద్రతను దృష్టిలో ఉంచుకుని శక్తి యాప్‌పై అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు శక్తి యాప్ ఉపయోగాలు, పనిచేసే విధానం గురించి వివరించారు. అవగాహన అనంతరం భక్తుల మొబైల్ ఫోన్లలో శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి, వినియోగంపై తెలియజేశారు. ఆపద సమయంలో టోల్‌ఫ్రీ నంబర్ల ద్వారా తక్షణ సహాయం అందుతుందని, మహిళలు, బాలికల సంరక్షణకు ఈ యాప్ ఎంతో ఉపయోగపడుతుందని నిర్వాహకులు సూచించారు. ఈ కార్యక్రమంలో శక్తి టీం4 ఇన్‌చార్జ్ హెచ్.సి. గిరిధర్‌తో పాటు శ్రీనివాస్, యమున, రమణమ్మ పాల్గొని భక్తులకు అవగాహన కల్పించారు.

గులివెందుల పేటలో 'సంకల్పం' సదస్సు

కొత్తూరు, జనవరి 18 (వార్త): యువతను పెడదోవ పట్టిస్తున్న మాదకద్రవ్యాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొత్తూరు ఎస్ఐ కె.వెంకటేష్ పిలుపునిచ్చారు. ఆదివారం గులివెందుల పేట గ్రామంలో 'సంకల్పం' కార్యక్రమంలో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడారు. గంజాయి వంటి మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని, వీటి వల్ల జీవితాలు చిన్నాభిన్నం అవుతాయన్నారు. డ్రగ్స్ సరఫరా లేదా వినియోగంపై సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలపాలని కోరారు. సాంకేతికత పెరుగుతున్న కొద్దీ సైబర్ మోసాలు కూడా పెరుగుతున్నాయని, గుర్తు తెలియని వ్యక్తులకు ఓటీపీలు చెప్పకూడదని సూచించారు. ఏదైనా సైబర్ మోసం జరిగితే వెంటనే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఒంటరిగా వెళ్లే మహిళలు అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, ముఖ్యంగా గొలుసు దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామంలో కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని, నేర రహిత సమాజ స్థాపనకు కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువత, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

ఉత్సవాల నిర్వహణలో లోటుపాట్లు ఉండకూడదు

*** దర్శన సమయంలో సామాన్య భక్తులకు పెద్దపీట * నాలుగు వరుసల్లో క్యూలైన్లు * దాతల పాస్‌లు ఉన్నవారికి నేరుగా ప్రవేశం * నేటి నుంచి రూ.300, రూ.100 టిక్కెట్లు * 24 నుంచి ఆన్‌లైన్‌లోనే క్షీరాభిషేకం టిక్కెట్లు * దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ * అధికారులతో కలిసి రథసప్తమి వేడుకల పర్యవేక్షణ**

అరసవల్లి, జనవరి 18 (వార్త): అరసవల్లి రథసప్తమి ఉత్సవాల్లో స్వామివారి దర్శనం కోసం సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తున్నామని, గర్భగుడి ఎదుట నాలుగు వరుసల్లో దర్శనం కల్పించడం ద్వారా భక్తులు క్యూలైన్లలో వేచి ఉండే సమయాన్ని గణనీయంగా తగ్గిస్తామని దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ స్పష్టం చేశారు. వేడుకల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు ఉండరాదని, ప్రతి సెక్టార్‌లో కీలక శాఖల అధికారులతో కలిసి ఏర్పాట్లు పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆయన రథసప్తమి ఉత్సవాల నిర్వహణపై డీఎస్పీ వివేకానందతో కలిసి అరసవల్లిలో ఏర్పాట్లు స్వయంగా పరిశీలించారు. అనంతరం ఆలయ అర్చకులు వేదమంత్రాలతో కమిషనర్‌కు స్వాగతం పలికారు. తదుపరి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన పత్రికా విలేకరుల సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ దర్శన ఏర్పాట్లపై ప్రత్యేక దిశానిర్దేశం చేస్తూ.. ప్రముఖుల (వీఐపీ) రాక వల్ల సామాన్య భక్తుల క్యూ లైన్లకు ఎక్కడా అంతరాయం కలగకుండా ప్రత్యేక మార్గాలను ఏర్పాట్లు చేయాలని ఇది ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమన్నారు. దాతల పాసులు ఉన్నవారికి నేరుగా ప్రవేశం ఉంటుందన్నారు. భక్తులకు ఆహారం పంపిణీ చేసే దాతల కోసం (ఫుడ్ డోనర్స్) ప్రత్యేక స్థలాన్ని కేటాయించాలని తెలిపారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు తాగునీరు పారిశుద్ధ్యం, విద్యుత్ వంటి కనీస సౌకర్యాల విషయంలో రాజీ పడకూడదని దేవాదాయ శాఖ తరపున 70 ట్యాంకులు, 30 వేల వాటర్ బాటిల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులకు రూ.300, రూ.100 టికెట్లను సోమవారం నుంచి ఆఫ్లైన్లో విక్రయిస్తున్నట్లు తెలిపారు. క్షీరాభిషేకం టికెట్స్ ఆఫ్లైన్ ద్వారా 24వ తేదీ నుండి బుక్ చేసుకోవాలని భక్తులకు సూచించారు. ఈ విధానం ద్వారా భక్తులకు సమయం కలిసి వస్తుందన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా టిక్కెట్ పైనే దర్శన సమయాన్ని కూడా తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. రథసప్తమి ఏర్పాట్లలో భాగంగా దేవాదాయ శాఖ నుండి 100 మంది సిబ్బంది, 500 మంది వాలంటీర్లు పాల్గొంటారన్నారు. క్యూ లైన్ల వద్ద భక్తులకు ఎండ తగలకుండా షేడ్ నెట్లు, చల్లని మజ్జిగ పంపిణీకి ఏర్పాట్లు చేయాలన్నారు. ఆయన వెంట డీఎస్పీ వివేకానంద, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శివరామప్రసాద్ (హరి), ప్రత్యేక అధికారి శోభారాణి, సింహాచలం దేవస్థానం సూపరింటెండెంట్ కంచమూర్తి , దేవస్థానం ఈ.వో. ప్రసాద్ రావు, అరసవల్లి ఆలయ సిబ్బంది, వివిధ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

రథసప్తమికి ఆన్‌లైన్ టికెట్లు విడుదల

రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం ఈనెల 25న ప్రత్యేక దర్శన స్లాట్లను ఏర్పాటు చేసినట్లు కార్యనిర్వహణాధికారి కె.ఎస్.వి.డి.వి. ప్రసాద్ తెలిపారు. భక్తులు తమ దర్శన టికెట్లను అధికారిక వెబ్‌సైట్ https://www.aptemples.gov.in 'మన మిత్ర' వాట్సప్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో పొందేలా ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా క్షీరాభిషేకం టికెట్లు (రూ.500) ఈ నెల 19 నుంచి 23 వరకు రోజుకు 450 చొప్పున, 24వ తేదీన 1750 టికెట్లు అందుబాటులో ఉంటాయని వివరించారు. ఈ టికెట్లను మూడు విడతలుగా అర్ధరాత్రి ఒంటిగంట నుంచి మూడు గంటల వరకూ, మూడు గంటల నుంచి ఐదు గంటల వరకూ, ఐదు గంటల నుంచి ఆరు గంటల వరకూ కేటాయించినట్లు పేర్కొన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈ నెల 19 నుంచి 24 వరకు సాధారణ దర్శన టికెట్లను కూడా టైమ్ స్లాట్ల వారీగా ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచామని ఈఓ వెల్లడించారు. భక్తులు తాము బుక్ చేసుకున్న నిర్దిష్ట సమయంలోనే దర్శనానికి రావాలని, ప్రవేశ ద్వారం వద్ద టికెట్ ప్రింట్ కాపీని తప్పనిసరిగా చూపించాలని స్పష్టం చేశారు. కేటాయించిన సమయంలోనే భక్తులను దర్శనానికి అనుమతిస్తామని, ఈ అవకాశాన్ని వినియోగించుకుని భక్తులు స్వామివారిని దర్శించుకోవాలని కోరారు.

నేటి నుంచి సిక్కోలులో సైన్స్ సంబరం

జిల్లాలో రథసప్తమి వేడుకలను పురస్కరించుకుని విద్యార్థుల్లో వైజ్ఞానిక అభి లాషను పెంపొందించేందుకు భారీ సైన్స్ ప్రదర్శన సిద్ధమైంది. జిల్లా కలెక్టర్ స్పప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాల మేరకు స్థానిక ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళా శాలలోని 'సిల్వర్ జూబ్లీ ఆడిటోరియం'లో ఈ ప్రదర్శనను ఏర్పాటు చేశారు. సోమవారం నుంచి ఈ నెల 25 వరకు వారం రోజుల పాటు ఈ ప్రదర్శన కొన సాగనుంది. సాధారణ ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని కలిగించడం, విద్యార్థులను పరిశోధనల వైపు మళ్లించడమే లక్ష్యంగా ఈ ప్రదర్శనను నిర్వహిస్తున్నారు. దీనికోసం జిల్లాలోని వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల (ఎచ్చెర్ల), శివాని ఇంజినీరింగ్ కళాశాల (చిలకపాలెం), ఐతమ్ ఇంజినీరింగ్ కళాశాల (టెక్కలి), ఐఐఐటీ - ఆర్జీయూకేటీ (ఎచ్చెర్ల), డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ యూనివర్సిటీ ఇంజినీరింగ్ విభాగంలో తమ వైజ్ఞానిక నమూనాలను ప్రదర్శించనున్నాయి. ఈ విద్యా సంస్థలకు చెందిన నిపుణులైన విద్యార్థులు తమ ఆవిష్కరణలను సందర్శ కులకు వివరించనున్నారు. ఈ మేరకు ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లకు జిల్లా యంత్రాంగం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ప్రదర్శన విజయవంతానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులకు కలెక్టర్ ఇప్పటికే ఉత్తర్వులు ఇచ్చారు. వారం రోజుల పాటు సాగే ఈ విజ్ఞాన జాతరకు విద్యా ర్థులు, మేధావులు, సాధారణ ప్రజలు అధిక సంఖ్యలో హాజరుకావాలని అధికారులు కోరుతున్నారు.

సురభి నాటక వైభవం.. నేటి నుంచే

కళల కాణాచి శ్రీకాకుళం నగరంలో పౌరాణిక నాటక సందడి మొదలవ నుంది. అరసవల్లి సూర్యనారాయణ స్వామి రథసప్తమి ఉత్సవాలను పురస్కరించు కుని, ప్రసిద్ధ సురభి నాటక సంస్థ (శ్రీ వినాయక నాట్య మండలి) ఆధ్వర్యంలో వరుస ప్రదర్శనలు నిర్వహించనున్నారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఆశీస్సులతో ఈ నాటకోత్సవాలు ఏర్పాటు చేశారు. స్థానిక అంబేద్కర్ ఆడిటోరియం వేదికగా సోమవారం నుంచి ఐదు రోజుల పాటు ఈ ప్రదర్శనలు కొనసాగనున్నాయి. 1925లో స్థాపించబడిన శ్రీ వినాయక నాట్య మండలికి సురభి నాటక రంగంలో విశిష్ట చరిత్ర ఉంది. పౌరాణిక పాత్రలకు ప్రాణప్రతిష్ఠ చేస్తూ, మంత్రముగ్ధులను చేసే రంగాలంక రణతో ప్రేక్షకులను అలరించడంలో సురభి కళాకారులు సిద్ధహస్తులు. నేటి నుంచి ప్రారంభమయ్యే ప్రదర్శనల్లో భాగంగా తొలిరోజు 'భక్త ప్రహ్లాద' నాటకాన్ని ప్రదర్శించనున్నారు. 20న భూకైలాస్, 21న శ్రీరామరాజ్యం, 22న శ్రీ శ్రీనివాస కళ్యాణం, 23న మాయాబజార్ నాటకాలు ప్రదర్శిస్తారు. ప్రతిరోజు సాయంత్రం ఆరున్నర గంటల నుంచి జరగనుంది. మరిన్ని వివరాలకు 9849052083 నంబరును సంప్రదించవచ్చని నిర్వాహకులు కోరారు.

పూర్వ విద్యార్థుల అపురూప కలయిక

మెళియాపుట్టి జనవరి 18 (వార్త): 1993-1994 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు ఆదివారం చాపర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పూర్వ విద్యార్థులు ఈ సమ్మేళనంలో పాల్గొని తాము చదువుకున్న రోజులనాటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. నాడు చదువు చెప్పిన వైయస్ ప్రకాశరావు, బి. సింహాచలం, స్టాలిన్, ఎన్ని లోకనాథం, దారపు శ్రీనివాసరావు, ఏవి రమణమూర్తి తదితర గురువులను సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మురళీమోహన్ పాత్రో, కె.సుధాకర్, కె.చిన్నబాబు, డి.నాగరాజు, దేవరత్నం, విశ్వేశ్వరరావు, ఎస్.మీసకేతన్‌రావు, సవరయ్య, ఎస్.వినోద్, పి.ప్రసాద్, హెచ్.వైకుంఠరావు, మేఘనాథం, డి.రవి, జి.జగదీశ్వరరావు, డి.రమ, మాధవి, రాణి, శాంతి, తదితర పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా వార్తలు

రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరు మృతి



సంతబొమ్మాళి, జనవరి 18 (వార్త): మండలంలో నౌపడా-టెక్కలి రోడ్డులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గార మండలం సిలగాం గ్రామానికి చెందిన నీలపు రాజశేఖర్ (32) మృతి చెందారు. రాజశేఖర్ నౌపడ నుండి తన అత్తవారి ఇల్లు టెక్కలి మండలం పెద్ద రోకళ్ళపల్లికు బుల్లెట్‌పై వెళ్తుండగా, పజ్రపుకొత్తూరు మండలంలో కొత్తపేట గ్రామానికి చెందిన ఉత్తరాల సంతోష్ టెక్కలి నుండి మండలంలో యామలపేట అత్తవారింటికి స్కూటీపై వస్తున్నాడు. ఎదురుగా వస్తున్న రెండు బలంగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో రాజశేఖర్ మృతి చెందగా, తలపై గాయమై తీవ్రంగా గాయపడిన సంతోష్ శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడు రాజశేఖర్‌కు భార్య, రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. మృతదేహానికి టెక్కలి జిల్లా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందజేశారు. నౌపడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గిరిజనులకు దుప్పట్లు పంపిణీ

మందస, జనవరి 18(వార్త): గ్రీన్ ఆర్మీ ఆధ్వర్యంలో భావనాపురంలో గిరిజనులకు దుప్పట్లు, బిస్కెట్లు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏపీఎన్జీవోస్, గ్రీన్ ఆర్మీ అధ్యక్షుడు బోనేల గోపాల్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రకృతికి దగ్గరగా ఉండే వ్యక్తులతో కలిసి, వారి యోగ క్షేమాలు తెలుసుకుని, వారి అవసరాలు తీర్చలేం కానీ.. గడిపే సమయం ఆనందాన్నిస్తుందన్నారు. కార్యక్రమంలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు అస్సాన మధుబాబు, పీఆర్ సిబ్బంది కొంచాడ సాయివెంకటశివ ప్రసాద్, ఉపాధ్యాయుడు దాసరి శ్రీనివాసరావు, గ్రీన్ ఆర్మీ సభ్యుడు హుస్సేన్, గిరిజన సంఘ నాయకుడు సవర ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546